# మాట



పాలడుగు వెంకటేశ్వరరావు

చీకటిపడుతూవుంది. లైట్లు వెలిగేయి!

కూరల సంచీ, చేత్తో పట్టుకుని బజార్లో నడుస్తూవున్న నారాయణ, సెంటర్లో ఆగి నిలబడి చుట్టూ ఒకసారి చూసేడు. తృప్తిగా గాలిని పీల్చేడు. ఆదరా బాదరాగా అటు పోతూవున్న పేర్నీడు కనపడగానే వుత్సాహం అపుకోలేక ఓ పొలికేక పెట్టేడు, నారాయణ.

ఆ కేకకి అదిరిపడిన పేర్నీడు ఆగి వెనక్కి తిరిగి చూసేడు.

"రా, రా" అన్నట్టుగ చెయ్యూపేడు నారాయణ, గబగబా.

"వస్తా, వస్తా. అర్జంటు పనిమీద

పోతువున్నా. వస్తా. మళ్ళీ వస్తా."అంటూ పోబోయేడు పేర్నీడు.

"ఆగు అర్జంటు! మాట మాట" అంటూ అంగలు పంగలు వేసి అతన్ని అందుకున్నాడు నారాయణ, సరేనంటే ఎక్కడ జారుకుంటాడో అన్న అదుర్దాతో.

చిరాగ్గా మొహంపెట్టి నుంచుండి పోయేడు పేర్నీడు.

"ఏవిటీ? ఆ అర్జంటూ! ఆ (?"

అన్నాడు నారాయణ నవ్వి, కులాసాగా.

"అర్జంటేలే. ఏవిటి నన్నాపీసేవు?!" అన్నాడు, విసుగ్గా పేర్నీడు.

''ఆగవోయి నీ అర్జంటూ నువ్వూను. ఆ.. ఏమిటి విశేషాలూ ?"

"నర్లే 'సభ' చాలించి అసలు విషయానికి రారాదూ? లేపోతే నే పోయి రానా ?"

"వొస్తున్నా ఆగవోయి. కాస్త గుర్రాన్ని కట్టేయి. ఆగమంటున్నాను గాదా! ఒక ముఖ్యమయిన సంగతి నీకు చెప్పాలి! అందుకే పిలుస్త!"

"సరె, ఆగేను. చెప్పమంటున్నానుగా" పేర్నీడు తొందరపడ్డాడు.

చెప్తా, చెప్తాగాని అర్జంటంటున్నావు. ఏవిటి విశేషమా అని...?"

"అదంతా తర్వాత చెప్తానన్నానుగా నన్ను పోనీక 'సోది' మొదలెట్టేవు. సంగతేంటో చెప్పరాదో..."

"చెప్తాగాని, అంతా బాపున్నారా ? ఏవిటా వురుకులూ పరుగులూ అని... ఈ వయసులో మనం కాస్త జాగర్తగా వుండాలి మరి. పోతే...''

పేర్నీడు, తల పట్టుకుని నిలబడి పోయేడు.నారాయణ సోది మొదలెట్టేడు. ప్రకృతి చాలా హాయిగా వుందన్న 'అధ్యాయం' ఆరంభించేడు.

''మరి నేను వెళ్ళిరానా ?'' అన్నాడు పేర్నీడు కోపంగా.

''వెళ్దువులేవోయి. మాట చెప్తానన్నానుగాదా! విని పోమంటున్నా గాదా! ముఖ్యమైన విషయం."

"మరి చెప్పు."

''చెప్తామనేగా పిలుస్త! ముందిది. చెప్పు. ఎందుకా వురుకులు పరుగులు? ఏమిటా అర్జంటుపని? ఈ మధ్య కనపట్టమే మానీసేవు! ఏమిటీ సంగతి? అంత 'బిజీ'గా తయారయేవేమిటీ?"

పేర్నీడు మొహం కందగడ్డలాగా అయింది.

''మహాప్రభూ! అవతల మా పెద్దమ్మాయికి నొప్పులు వచ్చాయి. నేను పోయి డాక్టర్ను పిల్చుకురావాలి. నన్ను వదుల్తావా లేదా?" అన్నాడు కటువుగా.

"అంత కంగారు పనికిరాదోయి. ఏదీ ఆగదు. అంతా అలాగ జరిగిపోతూనే వుంటుంది. అన్నట్టు నీకి సంగతి తెల్సిందా అని అడుగుదామనుకుంటున్నాను నేను.''

"ఏ సంగతి స్వామీ? త్వరగా చెప్పి నన్ను విడుదలచెయ్యి."

"అదేనయ్యా. నిజంగా తెలీకనే అలా అంటున్నావా అని!"

"తెలియదు, మహాప్రభో, అంటున్నాగా"

"నిజంగా తెలీదూ, సర్లె. నే చెపుతానులే. అసలు నేను అందుకేగా, నిన్ను పిలుస్తి. కాని నీకు తెలియకుండా ఎట్లా వుండిందీ అని!"

'నన్ను చంపక అదేదో త్వరగా 'కక్కు' బాబూ."

"కాస్త ఆగవోయి. నీ కంగారుని దొంగల్దోల"

"దొంగల్దోక ఎందుకులే! అందరి కంగారుని తోల్తూ నువ్వే ఇక్కడే నిలబడివుండు. మరి నేను వస్తాను," అని పోటోయేడు పేర్నిడు.

"అవునూ ఈ సంగతి విన్నావా అంటుంటే చెప్పకండా పోతానంటావేంటి?" అంటూ పేర్నిడుని బుజాలు పట్టుకుని ఆపేసేడు నారాయణ

పేర్నిడు గిజగిజలాడేడు. లబలబమన్నాడు.

"అబ్బ, నువ్వెప్పుడూ ఇంతేనోయి, వాళ్ళోపెట్టనా దళ్ళోపెట్టనా అంటావు. అంతా నీ కంగారుగాని అసలు సంగతి వినకుండా ఎట్లా పోతావోయి?"

"అదేదో తొరగా కానీ బాబూ! నన్ను పోనీ, నీ కాళ్ళు పట్టుకుంటా."

"చిత్రం ఈ చిత్రాల్లోనే గడిచిపోయాయి గద మన రోజులన్నీ. అవునా? యాభయి అయిదేళ్ళు నిండగానే 'ఫించనీ' పుచ్చుకోమన్నారా? పుచ్చుకున్నానా?"

"అవునయ్యా బాబు! నీతోపాటు నేనూ పుచ్చుకున్నాగా."

"అద్గదీ! అలా రా పాయింటుకి. అవునా? ఇద్దరము అలాగ 'ఫించనీ' పుచ్చుకుంటున్నామా? అది జరిగి రెండేళ్ళయిందా? ఈలోగా మా వాడు పైకి వచ్చి చేతికందివచ్చినంత పని చేసేడా?"

"యస్సూ. మరి నేను వెళ్ళి రానా?"

"ఆగవోయి నన్ను చెప్పనీయి, వెధవది ఈ వేళ నాకు ఎంతో ఆనందంగా వుందోయి. ఈ గాలి ఎంత బాగా వుంది! ఈ మనుషులందరూ ఎంత మంచివాళ్ళు! ఈ ప్రపంచం ఎంత కనుల పండుగగా వుంది! అవునా?"

"నీ సోడిని సొరకాయలాగ తెంప నన్ను చంపకు స్వామీ, నన్ను. పోనీ నీకు పుణ్యం వుంటుంది. అర్జంటని చెపితినిగా."

"పోదువుతే అన్నానుగా. విను మరి. మావాడు చేతికంది వచ్చేక నేను ఎన్ని ప్రయత్నాలు చేసేను! ఎందరి కాళ్ళు చేతులు పట్టుకున్నాను. ఆఖరికి ఆ దేముడికి దయగలిగిందోయి! మా కష్టాలు గట్టెక్కాయి. నిజంగా మా ఇంటిది, నేను

అన్నమూ నీళ్ళు మానేసామనుకో! 'ఉర్దరు కాయితం' నిన్ననే అందింది. రాత్రి నా కంటి మీదికి నిద్రే రాందే...! దాన్దుంపదెగ !"

"కథలు మానెయ్యి. ఆ మాటేదో చెప్పి నన్ను పోనీమని చెప్తున్నాను గాదా!" చిరాకు పెరిగి పేర్నీడు పళ్ళు పటపట కొరికేడు

"అవునయ్యా మా వాడికి ఒకదారి ఏర్పడింది. వాడు నిజంగా బుద్ధి మంతుడు. పిల్లనిస్తామని ఎంతకాలం నుంచో ఎంతమందో వస్తూవున్నారనుకో. సరే ఆ శుభకార్యం కూడా కానిద్దామను కున్నామా! అప్పుడు వాడేమన్నాడో తెలుసా? నాన్నా ముందు నాకు ఒక దారి ఏర్పడనీ. నా కాళ్ళమీద నన్ను నిలబడనీండి' అని నిజంగా ఎంత గొప్ప ఆలోచన వాడిది! వాడు ఎంత బుద్ధి మంతుడు...!"

"బుద్ధిమంతుడన్న మాట నిజమే! కాదని ఎవరూ అనలేదులే. అయినా నాకెందుకు గాని, మీ వాడు సిగరెట్లు తాగుతాడటగాదా?" అన్నాడు పేర్నీడు ఉక్రోషంతో.

"కుర్రవాళ్ళకి చిన్నచిన్న సర్దా లుంటం తప్పటోయి?! అది పెద్ద అప రాధమే?!" అని కళ్లెగరేశాడు నారా యణ.

"సర్లె. నాకనవసరమేగాని అతనీ మధ్యన తాగుడూ, పేకాట మొదలెట్టా ట్టగా? ఆ భుజంగరావు గదిలోనే కాల క్షేపం చేస్తున్నాట్టగా!"

నారాయణ మొహం ఎర్రబడింది.

"మొన్న ఆదివారంనాడు బజార్లో ఆ భుజంగరావు మీవాడి చొక్కా పట్టు కుని నిలేశాట్ట, పేకాటలో పెట్టిన అప్పు తీరుస్తావా ఛస్తావా అని. అప్పుడు మా వాడు అడ్డుపడి వదిలించాడట."

"పేర్నీడూ! ఇవన్నీ చిన్న చిన్న విషయాలు కిట్టనివాళ్ళు అనేకం అంటూ వుంటారు. అవన్నీ మనం పట్టించుకో గూడదోయి ఆ!" అన్నాడేగాని నారా యణ వుత్సాహం చప్పగా చల్లారి పోయింది!

"అవునూ, ఏదో మాట చెపుతానని నన్ను పట్టి ఆపేవు. ఇప్పటివరకూ గలగలమన్న వాడివి తక్కున ఆగి ఆలోచనలో పడ్డావు! ఇంతకీ ఏమిటి విషయం? అదేదో విని నే పోతాను మరి?" అని తొందరపెట్టాడు పేర్నీడు.

నారాయణ నోరుతెరిచి చెప్ప పోయేడు.

గాని నోరువిప్పి ఏమి చెపితే ఏం విన వలసి వస్తుందో అని భయపడి నోరు పెగలకుండా వుండిపోయి, కాసేపువరకూ.

అంతలో—

పేర్నీడుగారి పెద్దాడు పరుగెత్తు కుంటూ వచ్చాడు.

"నాన్నా, నాన్నా అక్కయ్య ప్రస వించింది. మగపిల్లాడు! తల్లీ బిడ్డా క్షేమం. అమ్మ నిన్ను పిల్చుకురమ్మంది. డాక్టరు అవసరం లేదట." అని కబురు అందించాడు పేర్నీడుకి.

పేర్నీడు। ఊపిరి వదిలేశాడు, తృప్తిగా, తేలికగా.

"వూ(. ఏవిటోయి ఆలోచన!? ఇంతకీ నువ్వు నాకు చెప్తానన్న 'మాట రాజాన్ని' చెప్పనేలేదు।" అని కదలే శాడు నారాయణ్ణి.

నారాయణ నోరు పెగుల్చుకొని అన్నాడు, "నిన్ననే ఆర్డర్సు వచ్చా యిశే। మావాడికి వుద్యోగం వచ్చింది।। ఇవాలే చేరుతానని వెళ్ళేడు. ఆ చల్లటి కబురే చెప్తామని అనుకున్నాను."

అది విని వెంటనే పేర్నీడు కొడుకు అందుకున్నాడు. 'ప్చ్' పొరపాటయిం దండి। పోస్టువాళ్ళు 'రాంగ్ డెలివరీ' చేసారట। అసలు సెలెక్షను అవతలి వీధి లోని పి. సుబ్బారావు'కి వచ్చిందట. ఇవాళ ఆఫీసుకి ఆ సుబ్బారావూ, మీ సుబ్బారావూ ఇద్దరూ వచ్చేసరికి మేనేజరు కంగారుపడ్డాడు. తీరా విచా రిస్తే ఆ సుబ్బారావు ఆఫీసరుగారి కాండి డేటనీ, సెలక్షను ఆతనిదేననీ తేలింది. అతన్ని వుద్యోగంలో చేర్చుకున్నారు. మీవాడు అప్పుడే తిరిగి వచ్చేసేడే!? ఇంటికి రాలా? అయితే ఈ విషయం మీకు తెలియనేలేదా!!"

నారాయణ మొహం పాలిపోయింది.

"ఇదంతా మీ ఆఫీసులోనే జరిగిం దేమిట్రా?" అన్నాడు పేర్నీడు, విదా రంగా మొహంపెట్టి. అవునన్నట్టు తలా డించాడు పేర్నీడు పుత్రుడు.

"మరి వాడు ఇంకా ఇంటికి రాలేదే!?" నీళ్ళు గారుతూ అన్నాడు నారాయణ.

"భుజంగరావు గదికిగాని వెళ్ళే డేమో। అక్కడ ఇరవయినాలుగ్గంటలూ పేకాట నడుస్తుందండి మరి...।" అన్న కొడుకుని కళ్ళతోనే హెచ్చరించేడు ఆగమని పేర్నీడు. నారాయణ తల వంచుకుని దిక్కుమొహం పెట్టేడు.

"మరి వస్తానోయి. పనుంది" అంటూ నీరసంగా కదలపోయేడు నారా యణ; వొట్టిసంచితోనే ఇంటి దిక్కుగా; నవనాడులు క్రుంగిపోగా.

"ఆగవోయి. మావాడు ఇంటిదగ్గర దిగపెట్టి వస్తాడు నిన్ను. లేకపోతే; చీకట్లో నువ్వు వెళ్ళగలవా..." అన బోయేడు పేర్నీడు సానుభూతిగా.

—అప్పటికే నారాయణ అంగలు పంగలు వేసి దూరమయిపోయాడు. గాలి లేదు. ప్రపంచం నల్లగా మసి పూసుకొన్న మారెమ్మవలె చీకట్లో మునిగి వికృతంగా అన్పించింది నారా యణకి. అప్పుడు అందరూ శత్రువులవలె అన్పించారు। అప్రయత్నంగానే నారా యణ కనులవెంట నీరు పూరి జారి చంపలమీద ధారికలు పడ్డాయి.

"నారాయణా, నారాయణా" అంటూ పిలిచేడు పేర్నీడు వెనుకనించి.

ఎవరి మాటా విన్పించుకునే పరి స్థితిలో లేడు నారాయణ ఆ క్షణాన।